క్లుప్తంగా

సీసీ రోడ్డు పనులు ప్రారంభం


పనులను ప్రారంభిస్తున్న నాయకులు

రుద్రూర్: మండలంలోని సులేమాన్‌నగర్ శివారులో గైని గుట్ట శ్రీ స్వయంభూ బసవేశ్వర స్వామి ఆలయం వరకు వేసే సీసీ రోడ్డు పనులను మాజీ ప్రజాప్రతినిధులు ఆదివారం ప్రారంభించారు. రోడ్డు నిర్మాణానికి ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ. 20లక్షలు మంజూరు కావడంతో పనులు చేపడుతున్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గంగాధర్ దేశాయ్, మాజీ సర్పంచ్ ఖాదర్, ఆలయ అర్చకులు పరమేశ్వర మహరాజ్, నారాయణరావు, దస్తగిరి, లింగం గౌడ్, లతీఫ్, హరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

మేధావులపై దాడులు తగవు


సమావేశంలో మాట్లాడుతున్న గంగాధర్

మాక్లూర్: ప్రజాకళాకారులు, మేధావులపై ప్రభుత్వం దాడులు చేపట్టడం తగదని అరుణోదయ సంస్కృతి సమైఖ్య రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దుడ్డు గంగాధర్ అన్నారు. ఆదివారం మండలంలోని వడ్యాట్‌పల్లిలో అరుణోదయ సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన కావూరి వెంకటేశ్వర్‌రావు వర్ధంతి సభకు గంగాధర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజాస్వామ్య బద్ధంగా ప్రజా ఉద్యమాలు చేపట్టేవారిపై నిందలు మోపి కేసులు పెట్టి వేధించడం సరైంది కాదన్నారు. కార్యక్రమంలో మహేశ్, నవీన్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

తాగునీరు వృథా.. ప్రజల వ్యథ


గోల్‌బంగ్లా సమీపంలో వృథాగా పోతున్న మిషన్‌భగీరథ నీరు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని గోల్‌బంగ్లా ప్రాంతంలో మిషన్ భగీరథ ద్వారా సరఫరా అవుతున్న తాగునీరు వృథాగా పోతోంది. పైప్ లైన్ లీకేజీ మరమ్మతు కోసం గుంత తవ్వి మధ్యలోనే వదిలేశారు. దీంతో నీరు పొంగిపొర్లుతూ రహదారిపై ప్రవహిస్తోంది. ఈ విషయం తెలిసినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి లీకేజీని సరిచేయాలని కోరుతున్నారు.

డబుల్‌రోడ్డుతో మెరుగైన రహదారి సౌకర్యం

- రెండేళ్ల క్రితం పనులు ప్రారంభం
- రోడ్డు సౌకర్యంతో తొలగిన ఇబ్బందులు


పచ్చలనడ్కుడ నుంచి వేల్పూర్ వైపు నిర్మించిన డబుల్‌రోడ్డు

వేల్పూర్: వేల్పూర్, పచ్చలనడ్కుడ గ్రామాల మధ్య డబుల్‌రోడ్డు నిర్మాణంతో రహదారి సౌకర్యం మెరుగుపడనుంది. రెండు గ్రామాల మధ్య డబుల్‌రోడ్డు నిర్మాణాన్ని ఇటీవల పూర్తి చేశారు. రెండేళ్ల కింద రహదారులు, భవనాల శాఖ మంత్రిగా ఉన్న ప్రస్తుత ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి డబుల్ రోడ్డును మంజూరు చేశారు. నాడు రహదారి నిర్మాణానికి శంకుస్థాపన జరుగగా, సాధారణ ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడంతో డబుల్‌రోడ్డు నిర్మాణ పనులు ఆగిపోయాయి. ఇటీవల కాంట్రాక్టరు పనులు చేపట్టి రోడ్డు నిర్మాణం పూర్తి చేశారు. మండల కేంద్రమైన వేల్పూర్‌కు వెళ్లేందుకు పచ్చలనడ్కుడ నుంచి ఉన్న ఐదు కిలోమీటర్ల దూరం సింగిల్‌రోడ్డుగా ఉండేది. మధ్యలో ఉన్న పెద్దవాగు వరకు నడ్కుడ, వేల్పూర్ గ్రామాల రైతుల పొలాలు ఉన్నాయి. నడ్కుడతో పాటు కొత్తపల్లి ఎస్, వాడి గ్రామాల వారు కూడా పనుల నిమిత్తం వేల్పూర్ వెళ్లేందుకు రహదారిని డబుల్‌రోడ్డుగా మార్చాలని నిర్ణయించారు. ఎట్టకేలకు డబుల్‌రోడ్డు పూర్తి కావడంతో పచ్చలనడ్కుడ, కొత్తపల్లి, వాడి గ్రామాల వారు జక్రాన్‌పల్లి, ధర్పల్లి మండలాల గ్రామాలవారు సైతం వేల్పూర్ వైపు వెళ్లేందుకు ఈ రహదారి చాలా ఉపయోగపడుతుంది. అంతేగాక పచ్చలనడ్కుడ, వేల్పూర్ గ్రామాల రైతులు పంట పొలాలకు పంటల ఉత్పత్తులు తరలించడానికి వాహనాలకు మార్గం సుగమమైంది.

ఎండలోనే ఫైర్


షెడ్డు లేకపోవడంతో ఎండలో ఉన్న ఫైరింజన్

బాల్కొండ: మండల కేంద్రంలో 2023 అక్టోబర్‌లో ఫైర్ స్టేషన్‌ను ప్రారంభించారు. బాల్కొండ, ముప్కాల్, మెండోరా మండలాల పరిధిలో అగ్ని ప్రమాదాలు సంభవిస్తే వెంటనే మంటలు ఆర్పే అవకాశం ఉంటుందనే ఉద్దేశంతో బాల్కొండ మండల కేంద్రంగా ఫైర్ స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. గతంలో ఐకేపీ కార్యాలయం నిర్వహించిన ఇరుకు గదిలో కార్యాలయం ఏర్పాటు చేశారు. ఫైర్‌స్టేషన్ కార్యాలయ నిర్మాణం కోసం జాతీయ రహదారి–44 పక్కన బండరాళ్లతో కూడిన 20 గుంటల స్థలాన్ని ప్రభుత్వం మంజూరు చేసింది. కాని నిధులు లేకపోవడంతో ఇప్పటికీ పనులు ప్రారంభం కాలేదు. ఫైర్ స్టేషన్‌కు నాలుగు నెలల క్రితం నూతనంగా ఫైరింజన్‌ను ప్రభుత్వం మంజూరు చేసింది. కానీ నీడలో ఉంచటానికి షెడ్డు కూడా ఏర్పాటు చేయలేదు. దీంతో ఫైర్ ఇంజిన్ ఎండలోనే ఎండుతోంది. దీనివల్ల ఫైరింజన్ దెబ్బ తినే ప్రమాదం ఉందని సిబ్బంది చెబుతున్నారు. ఫైరింజన్‌ను భద్రపరచటానికి షెడ్డూ నిర్మించడంతో పాటు పక్కా భవనం నిర్మించేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు డిమాండ్ కోరుతున్నారు.

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం..

ఫైర్‌స్టేషన్‌కు నూతన ఫైరింజన్‌ను నాలుగు నెలల క్రితం మంజూరు చేశారు. ఫైర్‌స్టేషన్ భవనం కోసం కూడా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. ఫైరింజన్ ఎండలో ఉంటుందని ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

– శేఖర్, ఫైర్‌స్టేషన్ ఇన్‌చార్జి ఆఫీసర్, బాల్కొండ

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ


జాన్కంపేట్‌లో చెక్కు అందజేస్తున్న నాయకులు

వేల్పూర్: వేల్పూర్ మండలంలోని 11 గ్రామాల్లో 45 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ. 12 లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఆయా గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు ఆదివారం పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో వేల్పూర్ ఏఎంసీ వైస్ చైర్మన్ గడ్డం నర్సారెడ్డి, భీమ్‌గల్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రంగు అనిల్‌గౌడ్, నాయకులు జేమ్స్ గంగారెడ్డి, గంగారెడ్డి, సొడ శ్రీనివాస్, సొడ జయరాజ్, కిశోర్‌గౌడ్, అరుణ్‌రాజ్, నర్సయ్య పాల్గొన్నారు.


కమ్మర్‌పల్లిలో..

కమ్మర్‌పల్లిలో..

కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లి మండలంలోని పలు గ్రామాలకు చెందిన 13 మంది లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆయా గ్రామాల్లో పంపిణీ చేశారు. నాయకులు రవి, ప్రవీణ్, సింగిరెడ్డి శేఖర్, దూలుర్ కిషన్‌గౌడ్, పాషా, అజార్, గంగాధర్, సాయి, రాజేశ్వర్, లింగారెడ్డి, మనోహర్, మేకల క్రాంతి, శ్రీధర్, నర్సయ్య, సృజన్, ధర్మయ్య పాల్గొన్నారు.

ఆలయానికి విరాళం అందజేత



పెర్కిట్: పెర్కిట్‌లో ఉన్న శివ పంచాయతన పంచముఖ హనుమాన్ ఆలయానికి కాలనీకి చెందిన విశ్రాంత హెచ్‌ఎం బెన్కి నారాయణ దంపతులు ఆదివారం రూ.75 వేలు విరాళంగా అందజేశారు. ఆలయానికి ఇనుప జాలీ ఏర్పాటు నిమిత్తం బెన్కి నారాయణ విరాళాన్ని అందజేశారు. విరాళం అందజేసిన నారాయణ దంపతులను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

రామన్నలొద్ది రోడ్డుకు మోక్షం!

- పీసీసీ అధ్యక్షుడి హామీ మేరకు త్వరలోనే పనులు ప్రారంభం
- స్థలాన్ని పరిశీలించిన ఆర్‌అండ్‌బీ అధికారులు


రోడ్డు కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్‌అండ్‌బీ అధికారులు, నాయకులు

మోర్తాడ్: భీమ్‌గల్ మండలం రహత్‌నగర్ నుంచి రామన్నలొద్ది ఆలయానికి వెళ్లే మార్గంలో రోడ్డు నిర్మాణానికి మోక్షం లభించనుంది. ఇటీవల శ్రీరామ నవమి ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ, పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ ఆలయానికి వెళ్లే మార్గంలో రోడ్డు నిర్మాణానికి హామీ ఇచ్చారు. అందులో భాగంగా రోడ్డు నిర్మాణానికి అనువైన స్థలం, అంచనాలను తయారీకి ఆర్‌అండ్‌బీ అధికారుల బృందం బుధవారం రహత్‌నగర్ నుంచి రామన్నలొద్ది వరకు పరిశీలించారు. ఇప్పటి వరకు మెటల్ రోడ్డు ఉండడంతో కంకర తేలి గుంతలమయం అయ్యేది. ఆలయానికి వెళ్లేందుకు సరైన రోడ్డు లేకపోవడంతో భక్తులు ఇబ్బందులుపడేవారు. తారు రోడ్డు నిర్మించాలని భక్తులు పీసీసీ అధ్యక్షుడికి విన్నవించిన విషయం తెలిసిందే. అధికారులు స్థల పరిశీలన చేయడంతో భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వేగం పుంజుకున్న ధాన్యం కొనుగోళ్లు


రుద్రూర్‌లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏఎంసీ చైర్మన్ సురేశ్ బాబా (ఫైల్)

రుద్రూర్: మండలంలో ధాన్యం కొనుగోళ్లు వేగం పుంజుకున్నాయి. ఐకేపీ, వ్యవసాయ సహకార సంఘాల ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఐకేపీ ఆధ్వర్యంలో సిద్దాపూర్, రుద్రూర్ గ్రామాల్లో, రెండు సింగిల్ విండోల ఆధ్వర్యంలో అంబం(ఆర్), అక్బర్‌నగర్, తగిలేపల్లి, రుద్రూర్, తగిలేపల్లి, రాయకూర్, రాణంపల్లి, చిక్కడపల్లి గ్రామాల్లో కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యం సేకరిస్తున్నారు. ఇప్పటి వరకు రాయకూర్ విండో పరిధిలో 35 వేల క్వింటాళ్ల ధాన్యం, రుద్రూర్ విండో పరిధిలో 50 వేల క్వింటాళ్ల ధాన్యం సేకరించారు. రుద్రూర్ కొనుగోలు కేంద్రంలో 15 వేల క్వింటాళ్ల ధాన్యం, అక్బర్‌నగర్‌లో 13వేల క్వింటాళ్లు, తగిలేపల్లిలో 8వేల క్వింటాళ్లు, అంబం(ఆర్)లో 11వేల క్వింటాళ్ల ధాన్యం సేకరించారు. వీటికి సంబంధించి 50 శాతం బిల్లులు రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు వెల్లడించారు. ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సిద్ధాపూర్‌లో ఆరు వేల క్వింటాళ్లు, రుద్రూర్‌లో ఐదు వేల క్వింటాళ్ల ధాన్యం సేకరించినట్లు అధికారులు వెల్లడించారు. ధాన్యం బిల్లులు వెంట వెంటనే ఖాతాల్లో జమ కావడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న వైస్ చైర్మన్

నవీపేట: మండలంలోని నిజాంపూర్‌లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని నిజామాబాద్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జంగిలి రాంచందర్ ఆదివారం ప్రారంభించారు. రైతులు తమ పంటను దళారులకు అమ్మి మోసపోవద్దని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం భూమేశ్వర్‌గౌడ్, నాయకులు బాల్‌రాజ్‌గౌడ్, బుచ్చన్న, పెద్దన్న, రమేశ్‌గౌడ్, విజయ్, భానుచందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జయంతి ఉత్సవాలకు ముస్తాబు



బాల్కొండ: బాల్కొండ, ముప్కాల్, మెండోరా మండలాల పరిధిలోని గ్రామాల్లో సోమవారం నిర్వహించే అంబేద్కర్ జయంతి ఉత్సవాలకు అంబేడ్కర్ విగ్రహాలను ముస్తాబు చేశారు. అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాట్లను ముమ్మరంగా చేపడుతున్నారు. విగ్రహాలకు రంగులు వేయడంతో పాటు లైట్లను ఏర్పాటు వేశారు. వేడుకలను అన్ని వర్గాల ప్రజలు విజయవంతం చేయాలని కోరారు.

కొనసాగుతున్న మల్లన్న ఉత్సవాలు



బాల్కొండ: ముప్కాల్ మండలం వేంపల్లిలో మల్లన్న ఆలయ ఉత్సవాలు రెండో రోజు ఆదివారం కొనసాగాయి. మల్లన్న కల్యాణం, బోనాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు ఏలేటి మల్లికార్జున్‌రెడ్డి ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నాయకులు సంతోష్, ముస్కు నర్సయ్య, నిమ్మల శ్రీనివాస్, సంతోష్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉచిత ఆరోగ్య సభ


మంజుశ్రీని సన్మానిస్తున్న సమాజ్ సభ్యులు

పెర్కిట్: ఆర్మూర్ పట్టణంలోని ఎస్‌ఎస్‌కే భవన్‌లో ఆదివారం మహిళా పతంజలి యోగా సమితి ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య సభ నిర్వహించారు. కార్యక్రమానికి మహిళా పతంజలి యోగా సమితి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల అధ్యక్షురాలు మంజుశ్రీ ముఖ్య అతిథిగా హాజరై సంపూర్ణ శారీరక, మానసిక, ఆధ్యాత్మిక లాభాలను పొందుటకు చేయాల్సిన మెళకువలను వివరించారు. అనంతరం మంజుశ్రీని మహిళలు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో క్షత్రియ సమాజ్ అధ్యక్షుడు బి రెడ్డి ప్రకాశ్, క్షత్రియ ప్రాంతీయ సమాజ్ మహిళ విభాగం ఉపాధ్యక్షురాలు ఖాందేశ్ సంగీత, సునీత జయరాజ్, గటడి స్వాతి, బి వీణ, కమల, లక్ష్మి, మంజుల, ప్రేమ, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.


బీఆర్‌ఎస్ ఆవిర్భావ సభను జయప్రదం చేయాలి


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

వేల్పూర్: బీఆర్‌ఎస్ పార్టీ ఆవిర్భవించి 25 ఏళ్లు కావస్తున్న సందర్భంగా వరంగల్ ఎల్కతుర్తిలో ఈ నెల 27న నిర్వహించే బీఆర్‌ఎస్ ఆవిర్భావ సభకు వేలాదిగా తరలివచ్చి జయప్రదం చేయాలని ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం వేల్పూర్‌లో చలో వరంగల్ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. బాల్కొండ నియోజకవర్గం నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరు కావాలని కోరారు. నాయకులు దొన్కంటి నర్సయ్య, బద్దం ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెక్కు చెదరని వంతెన

బాల్కొండ: మండలంలోని నాగాపూర్ శివారులో నిజాం సాగర్ కాలువపై నిర్మించిన వంతెన ఇప్పటికి చెక్కు చెదరకుండా ఉంది. వంతెనను రాళ్లు, దంగు సున్నంతో నిర్మించారు. ఒక్క రాయి కూడా ఇప్పటి వరకు కింద పడిపోలేదు. రోడ్డు గుండా వెళ్లే వారిని ఆ వంతెన ఆకట్టుకుంటోంది. ఈ వంతెన ఆనాటి ఇంజినీర్ల నైపుణ్యానికి, నాణ్యతకు నిదర్శనంగా నిలుస్తోంది.


నిజాంసాగర్ కాలువ పై నిర్మించిన వంతెన

పారిశుధ్యం.. అధ్వానం

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని చాలా ప్రాంతాల్లో చెత్త డబ్బాలు లేకపోవడం, సమయానికి చెత్త తొలిగించకపోవడంతో వీధులు చెత్తకుప్పలుగా మారాయి. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వచ్ఛ భారత్ మిషన్, స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమాలు కేవలం పోస్టర్లు, బ్యానర్లు, ప్రచార వాహనాల వరకే పరిమితమయ్యాయి. పట్టణంలోని ప్రధాన రహదారులు, అంతర్గత రోడ్లు చెత్తకుప్పలతో దర్శనమిస్తున్నాయి. ఇంటింటి చెత్త సేకరణ పథకం పేరుకు మాత్రమే ఉంది. పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలో, హుస్నాబాద్ కాలనీ, యోగేశ్వర కాలనీతో పాటు పలు కాలనీల్లో చెత్త నిర్వహణ సరిగా లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ అధికారులు పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పుర ప్రజలు కోరుతున్నారు.



యోగేశ్వ కాలనీలో జాతీయరహదారి పక్కన వేసిన చెత్త, ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి సమీపంలో..

గంగామాత జాతర ప్రారంభం



కమ్మర్‌పల్లి: మండలంలోని బషీరాబాద్ కాడి చెరువు వద్ద గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో ఆదివారం గంగామాత జాతర ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు గంగామాత పల్లకీ సేవా కార్యక్రమం, గంగమ్మ తల్లి, శివ పార్వతి ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఉంచి వల గొడుగుతో గంగపుత్ర సంఘం మహిళలు మంగళ హారతులతో శోభాయాత్రగా కాడి చెరువు వద్దకు తీసుకెళ్లారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకుడు కృష్ణ, గంగపుత్ర సంఘం అధ్యక్షుడు సుంకెట నారాయణ, కార్యదర్శి మోతె రవీందర్, సత్యానంద్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

రుద్రూర్: మండల కేంద్రంలో క్యాన్సర్ వ్యాధితో బాధ పడుతున్న రెండేళ్ల చిన్నారి మహన్విత చికిత్సకు ఎన్‌ఆర్‌ఐ, బీజేపీ సెగ్మెంట్ నేత కొనేరు శశాంక్ అందించిన రూ. ఐదు వేల ఆర్థికసాయాన్ని పార్టీ మండల నాయకులు ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో అలపాటి హరికృష్ణ, ప్రశాంత్ గౌడ్, రామరాజ్, బేగరి వినోద్ కుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సమాచారం..

నేడు తాగు నీటి సరఫరా బంద్

బోధన్ టౌన్ : బోధన్ పట్టణంలోని పలుచోట్ల సోమవారం నీటి సరఫరా ఉండదని కమిషనర్ వెంకట నారాయణ ఆదివారం తెలిపారు. అక్బర్‌నగర్ వద్ద మిషన్ భగీరథ పైప్ లైన్ లీకేజీ కావడంతో బోధన్ పట్టణంలో కొన్ని చోట్ల మున్సిపల్ వాటర్‌లో ఇబ్బందులు ఉంటాయన్నారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

సినిమాలు

పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

స్క్రీన్-1	అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి (తెలుగు) - 10.00, 1.05, 7.15, 10.20, ఫలక్ నుమా దాస్(తెలుగు)-4.10
స్క్రీన్-2	జాక్(తెలుగు)-10.50, 1.45, 4.40, 7.35, 10.30
స్క్రీన్-3	ద మమ్మీ (తెలుగు)-12.20, 2.50, 5.20, 7.50, 10.20
స్క్రీన్-4	గుడ్‌బ్యాడ్ అగ్లీ (తెలుగు)-10.30, 1.25 7.05, 10.0, మ్యాడ్ స్క్వేడ్(తెలుగు)-4.20



మాంసం ధరలు(రూ..)

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్స్‌డ్	200
		లైవ్	140
స్కిన్‌లెస్	240	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	93,700	వెండి(కిలో)	98,000
22 క్యారెట్స్	85,562		

– నిజామాబాద్ బిజినెస్

గ్రామాల్లో గావ్ చలో - బస్తీ చలో



రుద్రూర్‌లో గ్రామస్తులతో మాజీ ఎమ్మెల్యే, అంబేద్కర్ విగ్రహాన్ని కడిగి శుభ్రం చేస్తున్న యెండల లక్ష్మీనారాయణ

రుద్రూర్: రుద్రూర్ మండల కేంద్రంలో ఆదివారం బీజేపీ నాయకులు గావ్ చలో – బస్తీ చలో కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణ హాజరై అంబేద్కర్ విగ్రహాన్ని కడిగి శుభ్రం చేశారు. గోశాలలోని గోవులను శుభ్రం చేశారు. కార్యక్రమంలో ప్రశాంత్ గౌడ్, అలపాటి హరికృష్ణ, వడ్ల సాయినాథ్, కృష్ణం రాజు, వి రామరాజు, పార్వతి మురళి, వినోద్‌కుమార్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మోర్తాడ్‌లో..

మోర్తాడ్: బీజేపీ అగ్రనేతలు గావ్ చలో బస్తీ చలో కార్యక్రమం ఏర్గట్లలో కొనసాగింది. అంబేద్కర్ విగ్రహాన్ని బీజేపీ నాయకులు శుభ్రం చేశారు. నాయకులు ఏలేటి నారాయణరెడ్డి, ఘనశ్యాం, సురేశ్‌రెడ్డి, గంగేశ్వర్, భూమేశ్వర్, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.


ఏర్గట్లలో విగ్రహాన్ని శుభ్రం చేస్తున్న నాయకులు

పాఠశాలలో ఫేర్‌వెల్ పార్టీ



కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలోని మినిమి హైస్కూల్‌లో ఆదివారం నిర్వహించిన ఫేర్‌వెల్ పార్టీ ప్రోగ్రామ్ హంగామాగా సాగింది. పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ప్రముఖ సైకాలజిస్ట్ శ్రీనివాస్ హాజరై విద్యార్థులు, తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ చేశారు. కరస్పాండెంట్ బాలి రవీందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మహాధర్నాకు తరలిన ఉపాధ్యాయులు



కమ్మర్‌పల్లి: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం, పాఠశాలల పరిరక్షణకు ఎస్టీటీ యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద చేపట్టిన మహాధర్నా కార్యక్రమానికి కమ్మర్‌పల్లి మండలం నుంచి ఎస్టీటీ ఉపాధ్యాయులు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా ఎస్టీటీ యూనియన్ మండల అధ్యక్షుడు పసుపుల ప్రసాద్ మాట్లాడుతూ.. ఉమ్మడి సర్వీస్ రూల్స్ అమలు చేయడంతో పాటు, ఎస్ఏ, ఎస్టీటీ మధ్య వేతన వ్యత్యాసాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులు శ్యామల, సున్నం శ్రీనివాస్, సంతోష్ తదితరులు వెళ్లారు.

మోస్రాలో కుస్తీ పోటీలు



వర్ని: హనుమాన్ జయంతి సందర్భంగా మోస్రా మండల కేంద్రంలో గ్రామ అభివద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం కుస్తీ పోటీలు నిర్వహించారు. పోటీలకు గ్రామస్తులతో పాటు చుట్టుపక్కల గ్రామాల మల్లయోధులు పాల్గొన్నారు.